క్లుప్తంగా

నేటి సభను విజయవంతం చేయండి

కొడంగల్ రూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

డిప్యూటేషన్‌పై పరిగికి


డీటీ విజయేందర్

ధారూరు: మండల రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ పరిగి మండల రెవెన్యూ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు. డీటీ విజయేందర్ ఇక్కడే జూనియర్ అసిస్టెంట్, ఆర్ఐ, డీటీగా విధులు నిర్వహించారు.

ముదిరాజ్ పోరాట సమితి అధ్యక్షుడిగా నవీన్


నియామక పత్రం అందుకుంటున్న బొర్ర నవీన్

దుద్యాల్: కుదురుమల్ల గ్రామానికి చెందిన బొర్ర నవీన్ దుద్యాల్ మండల ముదిరాజ్ పోరాట సమితి యూత్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆదివారం తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ ముదిరాజ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

కాంగ్రెస్‌తో సంపూర్ణ అభివృద్ధి

లగచర్ల అధ్యక్షుడు లక్ష్మయ్య


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

దుద్యాల్: గ్రామాలు, పల్లెలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని లగచర్ల అధ్యక్షుడు లక్ష్మయ్య అన్నారు. ఆదివారం గ్రామంలో రూ.30 లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహకారంతో మండలం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతీ గ్రామంలో, తండాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

బంట్వారం: వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం సొసైటీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు చైర్మన్ రాంచంద్రారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఇందుకు గానూ సొసైటీ డైరెక్టర్లు, సంఘం సభ్యులు, రైతులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఏఈ ఆనంద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హైవే రోడ్డు నిర్మాణ పనులు నిర్వహిస్తున్న సందర్భంగా రోడ్డుకు ఇరువైపుల అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. గ్రామస్తులు ఈ విషయాన్ని గ్రహించి సహకరించాలని ఏఈ కోరారు.

పోలీసు పహారాలో యూరియా పంపిణీ

కందుకూరు: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద సీఐ సీతారామ్, ఏఓ లావణ్య ఆధ్వర్యంలో యూరియా పంపిణీ కొనసాగింది. 450 బస్తాలు అందుబాటులో ఉండగా.. ముందుగా జారీ చేసిన టోకెన్ల వారీగా ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. సోమ, మంగళవారాల్లో యూరియా రానుందని, మిగిలిన రైతులకు వచ్చిన వెంటనే పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

గొంగళ్లకు ఆదరణ కరువు!

- కొనేవారు లేక తగ్గిన అమ్మకాలు
- ఇబ్బందుల్లో గొళ్లలు
- ప్రభుత్వం ఆదుకోవాలని మొర


కొడంగల్‌లో గొంగళ్లను చూపిస్తున్న వ్యాపారి కుర్మయ్య

కొడంగల్ రూరల్: గొంగడి అంటేనే ఒకప్పటి గ్రామీణప్రాంతాలకు చిహ్నంగా కనిపించేవి. నెత్తిన రుమాలు ధరించి భుజాన వాటిని వేసుకునే వారు. రైతు, సామాన్య వ్యక్తులు, పెద్ద, పెద్ద భూస్వాములతో పాటు గొర్లకాపరులు, వీటిని ఎక్కువగా వినియోగించేవారు. ప్రస్తుతం వాటి ఉపయోగం తగ్గడంతో పాటు నేడు కనమరుగయ్యే స్థితిలో ఉన్నాయి. మనిషి జీవన శైలిలో వచ్చిన మార్పులే కారణమని తెలుస్తోంది. చలికాలం వచ్చిందంటే చాలు ప్రతీ పల్లెలోని రైతులు ముఖ్యంగా వృద్ధులు వాటిని కప్పుకునే వారు. పండగలు వచ్చినా, శుభ కార్యాలకు వెళ్లినా తప్పనిసరిగా వారివారి భుజాన అవి కనిపించేవి. ఎముకలు కొరికే చలిలో కూడా వాటిని ధరిస్తే శరీరానికి రక్షణగా ఉండేవి. ఇదే విషయాన్ని కొందరు వృద్ధులు, కుర్మ గొళ్లలు తమ అనుభవాలను వ్యక్తం చేస్తున్నారు. కాలక్రమేణ మార్పులు చోటు చేసుకోవడంతో మార్కెట్‌లోకి వస్తున్న రంగు, రంగుల దుప్పట్లు, రకరకాల రగ్గులు కొనుగోలు దారులను ఆకర్షిస్తున్నాయని, దీంతో వారు వాటినే ఎక్కువగా వినియోగిస్తున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం ఇళ్లలో దుప్పట్లు, రగ్గుల వినియోగం పెరగడంతో గొంగళ్ల వైపు చూసే వారు కరువయ్యారు. గొంగళ్ల తయారిని కుర్మ కులస్థులు ప్రధాన వృత్తిగా ఎంచుకుని జీవనం సాగించేవారు. కొడంగల్, కోస్గి, దౌల్తాబాద్, బొంరాస్‌పేట తదితర పట్టణాల్లోని సంతల్లో అమ్మకానికి తెస్తుంటారు. కానీ వాటి వ్యాపారం సక్రమంగా సాగక గొళ్ల కుర్మలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలికాలం, వర్షాకాలంలో అరకొరగా అమ్ముడుపోతాయని వేసవికాలం వస్తే ఇక అంతే సంగతులు. కొనేవారి సంఖ్యే కానరాదు. గొంగళ్లలో జాడు, సన్న, తెల్ల, కండ్ల గొంగళ్ల వంటివి వినియోగంలో ఉండేవి. ఆ రోజుల్లో సన్న గొంగడి ధరించే వ్యక్తుల గుర్తింపు గొప్పగా ఉండేది. వాటిని మరింత కాలం మన్నికగా ఉండేదుకు అంచుకు ఎర్రని దారంతో నేసేవారు. ఒక్కో గొంగడి ఖరీదు సుమారు రూ.1,500ల నుంచి రూ.5వేల దాకా ఉన్ని నాణ్యతను బట్టి తయారు చేసేవారని వర్తకులు పేర్కొంటున్నారు. ఐదు సంవత్సరాల క్రితం ప్రతీ అంగడిలో 8 నుంచి 15 గొంగళ్లను విక్రయించేవారమని, ప్రస్తుతం వ్యాపారం కష్టంగా మారిందంటున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, అధికారులు స్పందించి కుల వృత్తిదారులకు చేయూతనిచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

అలవాటుగా మారింది



నేను 12 ఏళ్ల వయస్సు నుంచి వేసుకుంటున్నాను. గొంగడి లేనిదే బయటికి వెళ్లలేను. ఇప్పుడు అది అలవాటుగా మారింది. దాదాపు 50 సంవత్సరాలుగా ఉపయోగిస్తున్నాను. మా పూర్వీకులు కూడా వేసుకునేవారు. ఇప్పటి వాళ్లు వీటిని ధరించేందుకు ఆసక్తి చూపడం లేదు.

– కుర్వ రాములు, పెద్ద నందిగామ

యూరియాకు తప్పని తిప్పలు

ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు


దోమలో ఎరువుల కేంద్రం వద్ద పడిగాపులుకాస్తున్న రైతులు

దోమ: యూరియా కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం కూడా ఆగ్రోస్ కేంద్రాల వద్ద ఉదయం నుంచి ఎదురు చూశారు. ముందు వరుసలో ఉన్న కొంత మందికే లభించడంతో ఎక్కువమంది వెనుదిరిగారు. దోమ, మోత్కూరు గ్రామాల్లో ఆగ్రోస్ సెంటర్లు ఉండగా గత ప్రభుత్వ పార్టీకి చెందిన వారికే ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు కేంద్రాలకు కలిపి ఒకే లారీ రావడంతో యూరియ సరిపోక రైతులు ఆందోళనకు దిగారు. దీంతో అధికారులు వారికి సర్దిచెప్పడంతో శాంతించారు.

కేంద్ర పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి

స్థానిక సంస్థల మండల కన్వీనర్ మహేశ్


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

కేశంపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని స్థానిక సంస్థల మండల కన్వీనర్ కంచుకోట మహేశ్ అన్నారు. తొమ్మిదిరేకుల, పోమాల్‌పల్లి, దేవునిగుడి తండాల్లో ఆదివారం గడప గడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ పసుల నర్సింహాయాదవ్‌తో పాటు మహేశ్ పాల్గొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలు అవుతున్న పథకాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. రైతులకు సబ్సిడీపై యూరియాను అందిస్తుందని, నిరుపేదలకు ఉచితంగా సన్న బియ్యం విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వం ఇస్తున్న ఇళ్లలో కూడా కేంద్ర ప్రభుత్వ వాటా ఉన్న విషయాన్ని గ్రామస్తులకు తెలియజేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి కల్వకోలు తిరుపతి, ఉపాధ్యాక్షుడు కంచుకోట నర్సింలు, ఎస్టీ మోర్చా నాయకులు రాజు నాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమణాచారి

ఆకట్టుకున్న వీధినాటకం

రవీంద్రభారతిలో ప్రదర్శించిన కళాకారులు

బొంరాస్‌పేట: ప్రపంచ జానపద దినోత్సవం ముగింపు వేడుకలను ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ జానపద కళా రూపాలను ప్రదర్శించారు. భాషా సాంస్కృతికశాఖ, టీఆర్‌జేకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాకు చెందిన 15మంది వీధినాటకోపాధ్యాయులు వీధినాటకం, జంటిపల్లి వెంకటయ్య బృందం ప్రదర్శనలు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన టీఆర్‌జేకేఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కేవీ రమణాచారి, దాత సారిపల్లి కొండల్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర భాషా సాంస్కృతిశాఖ అధ్యక్షుడు మామిడిహరికృష్ణ తదితరులను సన్మానించి అభినందించారు. సంఘం జిల్లా గౌరవఅధ్యక్షుడు అంజిలప్ప, కార్యనిర్వహణ కార్యదర్శి మెట్లకుంట వెంకటయ్య, సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్వ అంజిలయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.రాములు, గౌరవాధ్యక్షుడు సి.రాములు పాల్గొన్నారు.

గణపయ్య లడ్డూలకు భలే డిమాండ్

రూ.లక్ష నుంచి 5లక్షల వరకు వేలంలో కైవసం చేసుకున్న భక్తులు


బాలాజీ మందిర్ వేలంలో లడ్డూ దక్కించుకున్న నందకిశోర్‌పర్తానీ, కుమారుడు దినేశ్ పర్తానీ

తాండూరు: పట్టణంలో వినాయక మండపాల వద్ద నిర్వహించిన వేళంలో భక్తులు పోటీపడి లడ్డూలను దక్కించుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి డిమాండ్ పెరిగింది. పట్టణంలోని పటేల్ బాగిచా వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద వేలంలో రూ. 4,55,555లకు మంచాల భానురేఖ దక్కించుకున్నారు. బాలాజీ మందిర్‌లో నిర్వహించిన వేలంలో ప్రముఖ వ్యాపారి నందకిశోర్ పర్తాని కుమారులు దినేష్ పర్తానీ రూ.2.50లక్షలకు కైవసం చేసుకున్నారు. కన్యా పాఠశాల వద్ద చెన్‌మిళ్ల మనీష్‌కుమార్ రూ.3.11లక్షలకు సొంతం చేసుకొన్నారు. పట్టణంలో మొత్తం 280 వినాయక మండపాల వద్ద నిర్వహించిన వేళంలో భక్తులు పాల్గొని సొంతం చేసుకున్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు


అనంతగిరి: రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు

అనంతగిరి: ప్రధాని మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఆదివారం రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు.

చవకబారు మాటలు సిగ్గు చేటు..

పరిగి: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ చవకబారు మాటలు బాధాకరమని మండల అధ్యక్షురాలు నీరటి అనసూయ పేర్కొన్నారు. ప్రధాని తల్లిపై అనుచిత వాఖ్యలకు నిరసనగా పట్టణ కేంద్రంలో రాహుల్‌గాంధీ దిష్టి బొమ్మను దహనం చేశారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో బీజేపీపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం..

కుల్కచర్ల: అనుచిత వాఖ్యలను నిరసిస్తూ కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ముదిరాజ్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ మానసిక పరిస్థితి సరిగ్గా లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, దిశ కమిటీ సభ్యుడు జానకిరాం, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాటనిపల్లి అంజిలయ్య, నాయకులు చంద్రలింగం, శ్రీశైలం, కొండ ఆంజనేయులు, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

దోమలో..

దోమ: అనుచిత వాఖ్యలు చేయడం మానుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షుడు మేకల యాదయ్య పేర్కొన్నారు. దోమ మండల కేంద్రంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, ప్యాట అశోక్, గోవర్ధన్, బాబు, శివకుమార్, సాయి, కృష్ణ, మహేశ్, సంజీవ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట: అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించమని బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పాత బస్టాండు వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. లక్ష్మారెడ్డి, మైపాల్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


దోమలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు


కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు


మోమిన్‌పేట: బీజేపీ నాయకులను అరెస్టు చేస్తున్న ఎస్ఐ అరవింద్ తదితరులు


అనంతగిరి: వికారాబాద్‌లో నిమజ్జనోత్సవంలో రైల్వే ఉద్యోగులు


యాలాల: కోకట్ కాగ్నా నదిలో నిమజ్జనం చేస్తున్న భక్తులు


కొడంగల్ రూరల్: పెద్ద చెరువులో నిమజ్జనం చేస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది


తాండూరు రూరల్: సాయిపూర్‌లో పూజలు చేస్తున్న మహిళలు



పరిగి: వేలంలో రూ. లక్షకు లడ్డూను కైవసం చేసుకున్న గ్రామస్తుడు రవికాంత్‌రెడ్డి


కుల్కచర్ల: మందిపల్‌లో నిమజ్జనోత్సవంలో గ్రామస్తులు


అనంతగిరి: పూజలో ఉమ్మడి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి, అంజన్‌కుమార్‌గౌడ్

కొనసాగుతున్న పూజలు

గణేశ్ నవరాత్రోత్సవాల సందర్భంగా వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌ల్లో ఏర్పాటు చేసిన ఆయా మండపాల వద్ద వినాయకునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆదివారం ఐదోరోజు కావడంతో ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేపట్టారు. కొందరు నిర్వాహకులు నిమజ్జనానికి తరలించారు.


తాండూరు: భద్రేశ్వర్‌చౌక్ వద్ద స్వాగతం పలుకుతున్న పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బీఎంఆర్


ధారూరు: నృత్యం చేస్తున్న మహిళలు


దుద్యాల్: నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


బంట్వారం: బుగ్గాపూర్‌లో గణేష్ శోభాయాత్ర


మోమిన్‌పేట: నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు


బొంరాస్‌పేట: నిమజ్జనం చేస్తున్న చిన్నారులు